

# చిన్నస్వామి

కామరాజుగడ్డ రామచంద్రరావు

తెల్లవారి.

మఠం ముందు భక్తులు చేరుతున్నారు. సమాధిలో వున్న స్వామీజీ దర్శనం కోసం.

"ఇంతలో యెవరో స్వామీజీ వెళ్ళిపోయినా" అన్నారు.

"అయ్యో! స్వామీజీ వెళ్ళిపోవటమేమిటి? పది హేను రోజుల నుండి సమాధిలో వున్నాయన యెలా వెళ్ళిపోతారు?"

ఎలా వెళ్ళారో యెవరికీ తెలీదు. తెల్లవారేటప్పటికి అదృశ్యమైనారు.

మఠం వాకిట్లో పడుకొన్న మారికిగాని ముందు గదిలో పడుకొన్న విద్యార్థులకుగాని యేమీ తెలీదు. గదరకు వేసిన తలుపులు వేసినట్లే వున్నయి. స్వామీజీ మాత్రం లేరు.

శిష్యులు గజగజ లాడిపోయారు. ఏ మహపచారం జరిగిందో యేమోనని. కళ్ళ నీరెట్టుకొన్నారు కొందరు. గుండెలు బాదుకొన్నారు కొందరు. తమ దురదృష్టమని వాదించుకొన్నారు మిగతావాళ్ళు. ఉత్సవం పరగా వచ్చే భక్తులు అంతా అలా నిర్ఘాంత పడి నిలబడిపోయున్నారు.

స్వామి వెళ్ళటం తాత్కాలికంగానా లేక మఠం విడిచి గాని శిష్యుల మీద గల కృప తప్పి వెళ్ళిపోయినారా అన్నది అందరికీ సమస్యగానే వుంది.

ఇక పీఠాధిపత్యాన్ని పొందేందుకు ఆయన తుంటరి ప్రయత్నం చేస్తున్నాడేమో శిష్యపరమైన ప్రశ్న.

అది శ్రీ శంకరాచార్య మఠం.

స్వామిజీ దివ్యవర్చస్వి. శ్రీరామచంద్రమూర్తిని ధ్యానించాలంటే ఆయన్ను జ్ఞాపకం చేసికొంటే మనసు త్వరగా అనుసంధానమవుతుంది. తెల్లవారు జామున బావి దగ్గర స్నానంచేసి ధ్యానానికి గదిలో తిరిగి వచ్చేటప్పుడు స్వామి శ్రీరామచంద్రమూర్తి అవతారాన్ని యిదమిత్థమని దర్శింపజేస్తున్నారా అనిపించేది శిష్యులకు.

ఆయన ధ్యానంలో వుండగానే శిష్యులు వచ్చి దూరంగా నమస్కరించి ఎదుట కూర్చునేవారు. ఉపనిషత్పఠనం ఓంకారంతో ఆరంభమయ్యే దాకా. స్వామిజీ ఓంకార ముచ్చరించగానే శిష్యులు శ్రుతి కలిపి, శరీరాన్ని విరిచి, శబ్దతరంగాల్లో మునిగి పోయేవారు. తరువాత స్వామి ఉపనిషత్ శ్లోకాన్ని శ్రావ్యంగా గానంచేసి, వివరణం చెప్పేవారు. ఎనిమిది గంటలకు ఉపనిషత్పాఠం ఓంకారంతో ముగించ గనే శిష్యులు స్వామిని తాకి నమస్కారాలు చేసినా అంతా వెళ్ళిపోవలసిందే.

అంతరంగికులైన ప్రసాదరాయుడు, రామకోటి గార్లు కొంతసేపు నిలిచి మఠ విషయాలు ఆయనతో చెప్పటం కద్దు. వేదాధ్యయన మెలా జరుగుతోందన్న విషయం, వంట బ్రాహ్మణుడు సన్యాసం పుచ్చుకొంటానంటున్న వైనం యింకా మఠం ఆదాయవ్యయాలూ ఇవి చెప్పేది అనవయాషే.

ఇవిగాక లౌకిక పూర్వమైన సంభాషణం ఎన్నడూ ఆ పరిసరాల్లో వినపడేవి కావు.

ఈ మఠం ముందు ఇవాళ తండోప తండాలై స్వామిజీ సమాధిలో వున్నారని నమస్కరించి వెళ్ళ దామనీ వచ్చిన వారంతా దిగాలుబడి వెళ్ళిపోయున్నారు.

స్వామిజీని ఏడుగడగా పెట్టుకొని శిష్యులు ఎన్నో నిబంధనలని ఆచారాలనీ ఆశ్రమంలో అమలు పెట్టుతూ వుండేవారు. వచ్చేవాళ్ళ ఒక దోవ నుంచీ వెళ్ళేవాళ్ళ మరొక దోవనుంచీ నడిచేటట్లు చేస్తూ వుండేవాళ్ళు. ఇవాళ ఇదేమీ లేదు.

ఎంతసేపు నిలుచున్నా క్రొత్త సమాచారం అందటల్లేదు. నిలుచోని నిలుచోని వచ్చిన జనం తిరుగుముఖం పట్టుతున్నారు.

మఠ పరిసరం దాటంగానే జనులు స్వామీజీ వెళ్ళిపోవటానికి గల కారణాలను చర్చించటం ఆరంభించారు. తమకేమీ తెలీపోయినా తెలిసిందన్న చైతన్యాన్ని విదితం చేసికొంటూ వుంటారు సామాన్య జనం. ఎందుకంటే వాళ్ళు చిత్తశుద్ధి కరిగినట్టే ప్రసన్న చేతసులు కాపోవటంచేత,

"ఎందుకు వెళ్ళి వుంటారబ్బా!.. ఇక్కడేం కష్టమొచ్చిం దీయనకు?...చక్కగా విద్యా పరిచర్యలు చేస్తుంటే సుఖంగా వుండక?"

"అసలు యీ విద్య యెలాంటిదోలే!.. ఆవిడకు గర్భమటగా?"

"రామరామ నవ్వానేవా?"

"అబ్బెబ్బె. కాదు కాదు. అవకాశం. ఏదో శిష్యుడు పుణ్యం కట్టుకొని వుంటాడు. అందుకే స్వామి లేపోయి వుంటాడు. లేకపోతే యింత మఠం యింత ఆస్థి యింత హంగు యింతమంది శిష్యుల సత్కాలక్షేపం, అన్నీవదలి ఎందుకు వెళతారయ్యా!"

ఇంతలో నవ్వులు. ఆ నవ్వుల్లో యేదో దురర్థం—

"అయ్యా! శిష్యుల మీదయితే యేదో అభాండం విసిరావుగాని, అసలు స్వామీజీ వుండగా శిష్యుల కలాంటి అవకాశం ఎలా కలుగుతుందయ్యా?"

ధరా చక్రానికి ఆధారమైన ధర్మమే నవ్వుల పాలయే సమయం తొంగి చూసిందనిపించింది. అది గమనించిన శిష్యుల నేత్రాలు ప్రసాదుల్లై పారినయి.

"విషయం బయటపడి ప్రసాదరాయుడు లాటి వాళ్లు కర్రలుచ్చుకొని వెంటబడతారని చెప్ప కుండా దోవ చూసుకొన్నాడు స్వామీజీ."

"ఎక్కడికి పోతుంటాడు?"

"ఏ కాశీకో టూరు ప్రోగ్రాం వేసికొని వెళ్లి వుంటాడు."

ఇలా అనుకొంటూ జనం వెళ్లిపోయారు. అంత రంగికులైన శిష్యులు మాత్రం మఠసదనం ముందు మిగిలారు. అంతా చెంపలు చేతుల్లో వుంచుకొని విచిచిపోయి వున్నారు దిగాలబడి.

గంభీరంగా వింటూ వున్నవాడు ప్రసాదరాయుడు ఒక్కడే.

ఈయనే యిన్నేళ్లూ మఠ నిర్వహణాన్ని చూస్తున్నాడు. ఈయనకు సన్యాసం యిప్పించ వలెనని ఉద్దేశ్యం స్వామీజీయే ఒకటిరెండు సార్లు వెలిబుచ్చారట. మఠానికి సంబంధించిన భృత్యలోకం ప్రసాదరాయుడు గారిని చిన్నస్వామి అనికూడ అంటూ వుండేవాళ్లు.

స్వామీజీ వెళ్లిపోయారన్న తరువాత ఇక "వేల" యైన ప్రసాదరాయుడే మఠాధిపతి అని శిష్యుల మనసుల్లో స్ఫురించింది గాని ఆయనకు యింత వరకూ సన్యాస్యాశ్రమం యివ్వలేదే!—అనే సందేహం వెంటనే రావటంవల్ల యిది ఒక సమస్య అయింది.

నిజానికి శిష్యులంతా కూడ ప్రసాదరాయుడుగా రేమి చేయ బోతారా యాక్షణాన, అనేదే ఆలో చిస్తున్నారీ రోజు. పీఠాధిపతి యిక నెవరవుతారా అనే ప్రశ్నటుంచి యిప్పుడు మఠసరళి నడవాలిగదా.

రామకోటిగారు దగ్గరకు వచ్చి అడిగారు—

"ఈ యవాంతరమేమిటి రాయుడు గారూ! యిన్నాళ్లూ సమాధిలో వుండటం యివాళ అదృశ్యం కావటం కారణం యెవరికీ తెలియకపోవటం ఇదంతా యేదైనా అపచారం వల్ల కలిగిన ఫలితమా?" ఆయన కంఠం గద్గదికమయింది.

ప్రసాదరాయుడుగారు కొంచెం చికాకుపడ్డాడు. తను నిర్వహించే మఠంలో అపచారం ప్రసక్తి?

"ఇశ్. అపచార మేమిటి? మీ రేమయినా చేశారా అపచారం?.. మరెందుకలా అంటారు? ఆయ నెందుకు వెళ్లిపోయారో మనకెలా తెలుస్తుంది?" ఈ మాటలు కొంచెం కఠినంగనే వున్నయి.

"అదికాదు—మీరు ఆశ్రమం పుచ్చుకుంటారనీ ఆ తరువాత నేను కూడ ఆశ్రమ స్వీకారం చేద్దామనీ ఉద్దేశించాను. అలాగని స్వామిని మనం ప్రార్థించాం కూడ. వారి తోటి ధ్యానాన్ని ప్రసాదిస్తారని అను కొన్నాను. ఇంత నిర్దయ ఎందుకు కలిగిందో మన మీద."

రామకోటిగారి కళ్లు చెమర్చినయి. అవును మరి. మిత్రు డెవడో తనను అపార్థం చేసుకొన్నాడన్నప్పుడే మనిషయినవాడు మనసులో యేడ్చిపోతాడు. ఏడు గడే నమ్ముకొన్న స్వామి వాత్సల్యాన్ని త్రెంచుకొని వెళ్లి పోయారంటే ఏడవటానికి అబ్బురమేమిటి?

రాయుడు కఠినంగానే అన్నాడు— "ఇప్పుడు మాత్రమేం ఆయన మళ్లీ రారని మీకెవరయినా చెప్పారా?.. ఆయన యెవరితోనయినా చెప్పారా?"

రామకోటి గారన్నారు "ఏమోమరి ఆయన వెళ్లేటప్పుడు యెవరున్నారిక్కడ. విద్య యెక్కడో అవుటు హవుస్‌లో వుండి వుంటుంది."

విద్య తలుపు ప్రక్కన వుండి వింటోంది యీ సంభాషణ. అందుకని శిష్యు లిద్దరూ సార్థ కంగా తలుపు వంక చూశారు.

విద్య అన్నది: తెల్లవారకముందే వాకిట్లో ముగ్గు వేద్దామని వచ్చి ఆయనకు నమస్కరించాలని చూశా నటు. ఆయన లేరు. సమాధి చాలించారే అను కొంటూ దిగ్భ్రమతో నాలుగువైపులా చూశాను. దండ కమండలాలూ లేవు. నాకు హృదయంలో అదిరిపడ్డట్టుకొచ్చి మీకు కబురంపాను మాలిచేత.

నిట్టూర్చి రామకోటి గారన్నారు రాయుడు గారితో, "ఇక తమరే బాధ్యత వహించి యికనేం చెయ్యాలో ఆలోచించాలి. ఇవాళ జనార్దనస్వామివారు కాశీ నుంచీ వస్తారని కబురు వచ్చింది గదా! ఎదురు వెళ్లి తీసికొని రావాలో యేమో! ఏం చేయటానికీ తోచటల్లేదు."

రాయుడుగారు "వూఁ" అన్నారు.

*       *       *

రాయుడు గారికి సన్యాసం యిప్పించకుండా స్వామిజీ వెళ్లిపోవటానికి ఎవరు కారణం అనే సమ స్యకు కీలకం తెలియటల్లేదు. యెవరికి కూడ. అంతా పూర్వం జరిగిన సంగతులు మనసుల్లో తిరగ వేస్తూనే వున్నారు.

విద్యాగరి విధవ. కన్యాశుల్కమనే అధర్మ కారణంగా ఆమె రోగగ్రస్తుడైన ఒక ముసలివానికి భార్యగా కట్టబడింది. ఆ జరాతురుడు ఆమె పుష్పవతి కాకముందే భార్య నింటికి తెచ్చుకొన్నాడు. ఐతే కాలవశాత్తు ఆరునెలలకే చనిపోయాడు. ఆ తరు వాత యెప్పుడో విద్యాగరి పుష్పవతి అయింది. ఆమె తిరిగి పుట్టింటికి వెళ్లలేదు. భర్త వదలి వెళ్లిన యింట్లో కొన్నాళ్లు నివసించింది. తరువాత కొన్నాళ్లు ఎవరో ఆదరించే బంధువుల యింట్లో వుండి అనుకూలంగా మెలిగింది. అక్కడ భార్యా భర్తలకేనా స్పర్థలు రావటంతో ఆవూరు వదరి వచ్చింది.

రామకోటి గారికి ఆమె దూర బంధువు. ఈ వూళ్లో యెక్కడయినా చాకిరీచేయటమో లేదా భిక్షం అడుక్కోటమో చేసి బ్రతకాలని వచ్చింది. అందుకని రామకోటిగారు రాయుడు గారితో సంప్ర దించారు ముందు. ఇద్దరూ కలిసి స్వామితో చెప్పారు.

ఆమెను వంటశాలకు అధికారిణిగా అనుగ్ర హించ లసిందని కోరారు. ఉన్న వంటవాడు వెళ్లిపోవటం చేత వంటశాలలో ఆమెను యేర్పాటు చేస్తే మఠం నడక కుంఠితం కాకుండా వుంటుందని చెప్పారు. ఆమెకు సన్మార్గం చూపిన వాళ్లమవుతా మన్నారు.

స్వామీజీ మాట్లాడలేదు. అంటే స్వామీజీ సమ్మ తం శిష్యులు కందలేదు. శిష్యులూ మాట్లాడలేదు.

ఒక క్రమానికి స్వామీజీయే అన్నారు:

"ఒకరి కోసం ఒకరు దోవ తయారు చేయ టానికెవరికీ హక్కులేదు. ఎవరికి వారు స్వయంగా దోవ చూసుకోవాలి. ఎవరి ఆధ్యాత్మికోన్నతి కోసం వారు పాటుపడాలి గాని యింకొకరు పాటుపడ్డా ప్రయోజనంలేదు. అని అలవోకగా నన్నారు.

"మనం అందర్నీ ప్రేమించాలి అనంటే—అది మన వున్నతి కోసమే. 'ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి' అనేది అందుకనే." స్వామీజీ మళ్లీ నన్నారు.

శిష్యులకు అన్వయం కాలేదు చెప్పిన విషయం. అందుకని స్వామీజీ మళ్లీ అన్నారు:"

"ఆవిడ్ని మనం యిక్కడికి తెచ్చుకోవటం ఆవిడ మీది జాలితోనా లేక మన మఠం నడక కోసమా? మళ్లీ నన్నారు. "ఆమె తన దోవ కోసరం ఏమేం చెయ్యాలో మనకక్కర్లేదు."

అప్పటికి స్ఫురించింది రాయుడిగారికి..అన్నా డిలాగ: "అవును. ఆమె మీది జాలితో కాదు ఆమె నిక్కడ చేర్చటం. వంట యింటి నిర్వహణకు ఆమె సహకార పాటవం అవసరం కనక ఆమెను యిక్కడ చేర్చవలెనని సంకల్పం.

స్వామీజీ కండ్లు మూసికొని, "ఏం మగవాళ్లెవరూ దొరకటూ?" అన్నారు.

రాయుడు అన్నాడు. "స్వామీ! అయితే..స్త్రీలకు.. మఠంలో స్థానం.. వద్దంటారా?

'అవును. స్త్రీని మఠంలో చేరిస్తే మనం ఆధ్యాత్మి కాని కేమీ భంగంరాదు. కాని సిద్ధి ప్రపంచం అనేక వూహాల్ని చెస్తుంది కించపడకాశముంది దొరికితే. అలాటి పిశాచా విష్మమైన వూహలు అలా వూహించిన వాళ్లకు దుష్ప్రారబ్ధాన్ని సంతరించి పెట్టుతయి. వాళ్ల ఆధ్యాత్మికోన్నతికి అడ్డు వస్తాయి. వాళ్లని అధోగతికి దింపేస్తాయి. చిత్త శుద్ధిని వాళ్లకు కలుగనీయవు. మనల్ల చేతే వాళ్ల రాలని యెవల్ల వూహే వాళ్ల యిహమని మనం పాఠం చదువుకోవటల్లా?

'పిదను మఠంలో ప్రవేశపెట్టటం చేత ప్రజల్ని గోతిలో దింపిన వాళ్ల మవుతాము. ఎక్కలా దిగితే మనకేమని మఠస్థులమైన మనం అనుకొనే అధికారం మనకులేదు. మనకు మనమే ప్రసన్న చేతసులుగ వుండటంగాక ప్రజలను కూడ ప్రసన్న చేతసులుగా చెయ్యాల్సిన వాళ్లం మనం. అందుకే మఠాల్లో కొన్ని పధార్ని తప్పనిసరిగా అనుసరించాలి. మన అవుసరానవసరాలతో నిమిత్తంలేదు.

రాయుడు గారికీ రామకోటి గారికీ యేంచెప్పాలో తెలీలేదు. చివరకు రామకోటిగారన్నారు:

'జితేంద్రియులైన ఓను ప్రభావం మిమ్నంతు విలా ప్రకాశిస్తున్నంతసేపూ ప్రజలు మాత్రం తమని దురర్థంతో కళ్లెత్తి చూడగలరా? విద్యా ధరికి యిక్కడనే ప్రవేశం లేకపోతే యింకెక్కడ స్థానం దొరుకుతుంది''?

స్వామీజీ కండ్లు మూసికొని నారాయణ అన్నారు. అంటే అర్థం సరే మీ యిష్టం అన్నమాట.

ఆవిధంగా విద్య మఠ ప్రవేశం చేసింది.

ఆమె చేరిం తరవాత మఠసదన పరిసరాల నిర్వాహణం యెంతో చాకచక్యంగా ఆమే నిర్వర్తించుతూ వుంది. స్వామికి స్వయంగా వంట ప్రత్యేకంగా చేస్తుంది. ఆయనకు వడ్డించి యివతలకు వచ్చేస్తుంది. స్వామి ఒక్కరూ నారాయణ స్మరణం చేస్తూ ఆరగించేవారు.

సాయంత్రం స్వామీజీ ఉపన్యాసం అయిం తరవాత విద్య పాలూపళ్లూ తెచ్చి స్వామీజీ సముఖాన వుంచి నమస్కరించి వెళ్లుతుంది. తరవాత విద్యార్థుల భోజనాలు. విద్య రాత్రులు భోజనం చేయదు. పళ్లు మాత్రం తీసికొంటుంది.

ఉదయం సాయంత్రం విద్య నమస్కరించి నప్పుడు ఆమెకు వినపడేటట్లు స్వామీజీ నారాయణ స్మరణం చేయటం తప్ప విద్య స్వామీజీతో మాట్లాడటం అనేది వుండేదికాదు.

రాత్రులు హాలులో యెత్తుగా వున్న రాతి వేదిక మీద స్వామి యోగాభ్యాసం చేస్తూ కన్నుమూస్తారు. నిప్పుడు నిద్ర పోతారో మరి.

రాయుడుగారు వంటయింటి నిర్వహణకు యేం కావాలనే విషయం విద్యతో సంప్రదిస్తారు. రామకోటిగారు విద్య యోగక్షేమాలు అప్పుడప్పుడూ అడిగి తెలిసికొంటూ వుంటారు.

ఒకనాడు కాశీనుంచీ జనార్దనస్వామి వస్తారని కబురు వచ్చింది. ఆనాడు స్వయంగా విద్యను పిలిచి చేయవలసిన యేర్పాట్లేవో కొన్ని చెప్పారు. తరువాత రాయుడుగారు వచ్చి ఉత్తరం చదివి వినిపిస్తూ పలాని యేర్పాట్లు చేయాలన్నారు. విద్య తానది వరకే చేసిన యేర్పాట్లు చూపించింది. రాయుడుగారికి విస్మయం తోచింది. స్వామీజీ విద్యతో మాట్లాడాడన్న విషయం తెలిసి.

జనార్దనస్వామి అప్పటికి వచ్చి నాల్గురోజు లున్నారు. ఆయన ఉత్తరదేశస్థుడు కావటం చేత భోజన సదుపాయాల విషయంలో రాయుడుగారూ రామకోటిగారూ కూడ ఎక్కువ శ్రద్ధతో విద్యకు సహాయంగా వుండి మఠ నిర్వహణాన్ని భుజస్కంధాల మీద వడిసారు.

స్వామి ఆ తరువాత అన్నారు రాయుడూ విద్య వున్న సమయాన.. ''జనార్దనస్వామి వున్న నాలుగు రోజులూ విద్య చాలా శ్రమపడింది. ఆమాట జనార్దనస్వామే అన్నారు'' అని అన్నారు. విద్య నమస్కరించి వూరుకొన్నది.

స్వామి వెళ్లిపోయినారు. పూలమొక్కలను చూస్తూ. రాయుడుగారు తనకు చేసిన-సహాయానికి విద్య కృతజ్ఞత చెప్పి రాయుడుగారికి నమస్కరించింది.

''నాకెందుకూ నమస్కారం స్వామివారికి చెయ్యాలిగాని' అన్నాడు రాయుడు.

''ఆయన భగవంతుడు. ఎలాగయినా కరుణిస్తారు. మీలాంటి పెద్దలకే నమస్కారం చెయ్యాలి. నేను చిన్నదాన్నే కదా!'' అన్నది విద.

రాయుడుగారు మేజిస్ట్రేటు చేసి రిటయిరయినారు. నేను చిన్నదాన్ని కదా' అనే మాటకు ఆయన మనసు అదిరిపడింది. చిరునవ్వు నవ్వి ''నేను

# చిన్న స్వామి

మాత్రం చిన్నవాణ్ణి కాదా యేం?'' అని చలోక్తి విసిరారు.

ఈ సమయానే స్వామీజీ తిరిగివస్తూ యీమాట విన్నారు. కాని యెరగనట్లూరుకొన్నారు. అలాంటి చలోక్తులీ ప్రదేశంలో అనరాదని చెప్పలేదు. రాయుడు నాలుక కొరుక్కొన్నాడు, అలా చలోక్తి అనటం స్వామీజీ విన్నందుకు.

స్వామిజీ నారాయణ స్మరణం చేసికొంటూ, మొక్కలూ పూవులూ చూస్తూ పెరడు చుట్టూ తిరిగి లోపలకు వెళ్లిపోయినారు. వెళ్లటమే తడవు ధ్యానంలో కూర్చున్నారు. అప్పటికి మామూలుగా విశ్రాంతి తీసికొనే సమయం పూర్తికాలేదు. ఆధ్యానం ధ్యానం ఐదింటి దాకా పీట మీద పద్మాసనంలో వుండిపోయారు. ఐదింటికిగాని లేచి స్నానానికి వెళ్లలేదు.

దొడ్డిలో నుంచి వచ్చి రాయుడుగారు స్వామి ఎదుట నిలచారు, సెలవు తీసికొందామని. చాలసేపు కూర్చొని యిక లాభంలేదనీ యింటికి వెళ్లి స్నానం చేసి మళ్లీ ఉపన్యాసానికి రావాలి కదా అనీ వెళ్లిపోయాడు స్వామీజీ కళ్లు తెరువకముందే.

ఏదయినా అపచారం జరిగితే స్వామీజీ ధ్యానంలో కూర్చుంటారనే విషయం రాయుడికి తెలిసింది. ఆవిధంగా.

ఇప్పుడీ పదిహేనురోజుల్నుంచీ స్వామీజీ ధ్యానంలో కూర్చొని లేవటమనేదే లేని పరిస్థితి ఎందుకు కలిగిందీ అనే విషయాలు రాయుడు గారు ఆలోచిస్తూనే వున్నారు. అది ఎవరు చేసిన అపచారమో అర్థంకాక సతమతమవుతున్నాడు. ఈ ఆలోచనల్లో మనసుకు చిత్తశుద్ధి లేని కారణాన అనుమాన పిశాచాలతో మనసును ఆవిష్టం చేసి బాధపడుతున్నాడు రాయుడుగారు. ఆ చిత్తశుద్ధి అనేది కలగటానికి పాపం ఆయనకు భగవదనుగ్రహం ప్రాప్తించాలి. అందాకా అది కలగదు.

స్వామి సమాధిలో కూర్చోటానికి ముందు కొన్నిసంఘటనలు జరిగినయి.

విద్యకు యేదో అనారోగ్యం ప్రవేశించింది. శ్రమ చేయలేక పోతోంది. నడుం లాగెక్కింది. ఒకనాడు స్వామీజీకి భోజనం వడ్డించి వస్తుంటే స్వామీజీ తేరిపార చూశారామె వంక.

ఆనాటి సాయంత్రమే రాయుడుగారు విద్యను ప్రశ్నించాడు. విద్యార్థు లెక్కడ పడుకొంటారనీ, మాలీ మఠంలోనే ఉంటున్నాడా లేదా అనీనూ. చివరకు రహస్యంగానూ, గంభీరంగానూ అన్నాడు ''స్వామీజీ పరమాత్ముడు. ఆయన నిష్ఠకేమీ భంగం వాటిల్లకుండా నీవుండాలి. సుమా'' అని. ఇలా చెప్పటం విద్య ముఖం జేవురించటం, హాలు వాకిట్లో నిలబడి స్వామీజీ చూశారు. రాయుడుగారు కాని విద్యకాని యీ సంగతి నెరగరు.

స్వామీజీ తన స్థలంలోకి వెళ్లి కూర్చున్నారు. 'విద్య ఏడ్చింది. ఆ యేడ్పు స్వామీజీకి కూడ విన పడింది. స్వామిజీ ఆలోచించారు— విద్యనేమని చీవాట్లు పెడుతున్నాడీరాయుడు?'' అని. ''నారాయణ'' అంటూ కణతలు పట్టుకొన్నాడు. రాయుడు లోపలకు వచ్చి స్వామికి నమస్కరించి వెళ్లిపోయాడు.

దొడ్లో విద్య డోక్కున్నది. స్వామీజీ విని అదిరి పడ్డారు. గబగబా దొడ్లోకి వెళ్లి వంటయింటిలో నుంచి మంచినీరు ముంచి తెచ్చి ఆమె కిచ్చారు. ఆమె నిర్ఘాంతపోయింది.

అంతే. స్వామీజీ నారాయణ స్మరణం చేస్తూ లోనికి వెళ్లి ధ్యానంలో కూర్చొన్నారు. ఆనాడు ఐదయినా ధ్యానం నుంచి లేవలేదు. శిష్యులంతా వచ్చి కూర్చొన్నా ఆనాడు ఓంకారం పలకలేదు. ఆనాడు ఉపన్యాసం లేదు. ఆ తరువాత కూడ లేవలేదు.

మరునా డుదయం తిరిగి శిష్యులు వచ్చేటప్పటికి కూడ స్వామి అలానే కూర్చొన్నారు. రాత్రి వుంచిన పండ్లు పాలూ అలానే వుండిపోయినయి.

ఇదంతా యిలా యెందుకు జరుగుతోందో యెవరికీ అర్థంకాలేదు. రాయుడుగారిని యెవ



...నా అడిగినా ఆయనకే తెలీక ఏదో ఏసుక్కొంటున్నాడు. అంతకుపూర్వం స్వామీజీ విషయం అలా త్రోసి వేసేవాడు కాదు. ఆయన ముఖం ముటముట లాడటం ఆరంభించింది. కాబోయే మఠాధిపతి అని, స్వామిజీకి 'చేల' అని అనిపించుకొనటం చేత ఆయన ముఖం బాధ్యతల బరువును సూచిస్తోందా—ఏమో మరి.

పదిహేనురోజుల సమాధి తరవాత స్వామిజీ ఉవాళ అదృశ్యమై వెళ్లిపోయారు. కారణం యెవరికీ తెలీలేదు.

రాయుడుగారి అనుమానం యేమిటంటే విద్య డోక్కోవటానికీ స్వామి సమాధిలో వుండి యిప్పుడు వెళ్లిపోవటానికీ సంబంధం వుండి వుంటుందీ అని. మామూలు మనుష్యుల కయిన ప్రమాణమే వేల్పులయిన వారికి కూడ అన్వయించరాదని ఆయనకు తెలీదు. అలాంటి వూహలు రావటం అతడి గ్రహచారం.

ఆ వూహ మనసులోకి రాంగానే రాయుడుగారు, రామకోటి గారిని దగ్గరకు పిల్చి విద్య అనారోగ్య లక్షణాలూ తన అనుమానం రెండూ ఆయన చెవిని వేశారు. రామకోటి గారు కంపించిపోయారు. విద్యకు అనారోగ్యమంటే అది అనారోగ్యంగానే యెందుకు అర్థం చేసుకోవటల్లేదీ రాయుడుగారు: తెస్తే! విద్యను పిలిచి పలకరించాడు రామకోటిగారు.

జనార్దనస్వామి వారు వస్తారని రొట్టెలకు పిండి తడిపి పెట్టుతున్నది విద్య. రాయుడు గారికీ రామకోటి గారికీ కూడ హఠాత్తుగా 'స్వామి' సంగతి జ్ఞాపకానికి వచ్చింది.

రామకోటి గారన్నారు: "విద్య విషయం వదిలేసి, ముందు జనార్దనస్వామి వారి ఆహ్వానం విషయం చూడండి రాయుడుగారూ."

రాయుడు వెంటనే అందుకున్నాడు: "ఆయన వచ్చేలోపల యీ మనిషి నిక్కణ్ణుంచి పంపివేస్తేనే గాని శాంతి వుండదేమో."

"ఏమిటీ?... ఆవిడ్ని ఎక్కడకు పంపుతాం?"

"ఇంకెక్కడకు? మీ బంధువేగా. మీ యింటికే తీసికొనిపోయి పురుడు పొయ్యి. ఏంచేస్తావ్?"

"రాయుడు గారూ! విద్యను అనుమానిస్తున్నారు సరే,—మరి స్వామీజీని కూడ అనుమానిస్తున్నారా?"

"మరి యీ వెళ్లిపోవటానికి అర్థమేమిటీ?"

రామకోటికి తల తిరిగిపోతోంది. చాలా నిక్కచ్చిగనే అన్నాడు: "ఆయన వెళ్లిపోవటానికి అర్థమేమిటీ? ఆయన యిందంతా తన స్వార్థానికి కాదని యెప్పుడన్నా ఆశించారు కనక ఉండాలని యీ భవనపు చూరుపట్టుకొని వేళ్లాడు తారా!.. మీరు ఆయన్ని అనుమానించిన క్షణాన మీచే నిర్వహింపబడే యీ మఠంలో ఆయన ఒక్కక్షణం కూడ వుండరు... ఇంతవరకూ ఆయన వెళ్లిన కారణం తెలీక బాధపడుతున్నాను. ఇప్పుడు తెలిసిపోయింది. దీనికి కారణం మీకు కలిగిన అనుమాన పిశాచమేనని."

ఇంతలో ఒకాయన యేదో చీటీ తెచ్చి రాయుడు గారికిచ్చారు. దాని ప్రకారం జనార్దనస్వామి వూళ్లోకి వచ్చారుట. మఠసదనానికి రారుట. శ్రీయోలాల్ సత్రంలో వున్నారు. ప్రసాదరాయుడు గారు వచ్చి మాట్లాడవలసిందని వుంది దాంట్లో.

# చిన్న స్వామి

రాయుడు రామకోటిగారికి ఆ చీటీ చూపించి "జనార్దనస్వామి కూడ యిక్కడకు రారుట. ఆయన దివ్యదృష్టికి అప్పుడే అంతా అర్థమయి వుంటుంది. ఇప్పుడేమంటావు?" అన్నాడు. "నేనక్కడికి, భోజనం అయింతరవాత వెళ్తాను." అన్నాడు.

రామకోటిగారు లోపలికి వెళ్లి విద్యతో జనార్దనస్వామి మఠానికి రారనీ శ్రీయోలాల్ సత్రంలో వున్నారనీ చెప్పి ఆమె కళ్లలో కాంతి తరిగిపోయిందనీ, అది అనారోగ్య కారణమనీ సాయంత్రం డాక్టరు దగ్గరకు వెళ్లటానికి సిద్ధంగా వుండమనీ చెప్పి వెళ్లాడు.

ప్రసాదరాయుడు భోజనంచేసి శ్రీయోలాల్ ధర్మశాలకు వెళ్లేటప్పటికి రామకోటిగా రక్కడే వున్నారు. స్వామిజీ దర్శనం చేసికొనటం కూడ అయింది. అయినా మళ్లీ యిద్దరూ కలిసి స్వామి దర్శనం చేసికొన్నారు.

జనార్దనస్వామి అడిగారు: మీ స్వామిజీ కాశీ యాత్రకు వెళ్లారటగా! ఆయన రాత్రి నాల్గో యామంలో యీ సత్రానికి వచ్చారట. ఎవరినో నిద్రలేపి, జనార్దనస్వామి వస్తున్నారు. ఎదురు వెళ్లి తీసికొని వచ్చి యీ సత్రంలోనే బస చేయించవలసిందని చెప్పి కాశీ యాత్రకు వెళ్లిపోయారట. అతను నిద్ర లేచి చూసేటప్పటికి స్వామిజీ వెళ్లిపోవటం కూడ అయిపోయింది. ఈ శ్రీయోలాల్ ఆ సంగతి తెలిసికొని వచ్చి యిక్కడకు తీసికొని వచ్చారు.

రాయుడు గారన్నారు: "స్వామిజీ కాశీయాత్ర విషయం మా కెవ్వళ్లకీ తెలీదు స్వామీ. మరి వారెంతకు యింత అన్యాయం చేశారో మమ్మల్ని!"

"ఆయన వెళ్లాలని వెళ్లితే మీకు చెప్పవలసిన అవసరమేముంది? మీరంతా కూడ బయలుదేరి వెంట బడతారనేమో"

'అయ్యో వెంటపడితే మాత్రం ఆయన సుఖం కోసరమే. మేం ప్రాకులాడుతాము గాని,—ఆ పెదధ్యానాన్ని ఆశించేవాళ్లం..'

జనార్దనస్వామి పెద్దగా నవ్వారు. "ఆయన కోసరం మీరు ప్రాకులాడడ మేమిటయ్యా!" అన్నారు.

రామకోటిగారు సెలవు తీసికొని వెళ్లిపోయారు.

రాయుడుగారు మాటల సందర్భంలో, విద్యకు రెండుమూడు నెలల నుంచీ అనారోగ్యంగ వుందనీ డోకులనీ ఏదో అనుమానాస్పదంగా వుందనీ చెప్పాడు.

స్వామి రాయుడి వంక క్షణం చూసి చిరునవ్వు నవ్వి ఊరుకొని తరువాత—"డాక్టరుకు చూపెట్టవలసింది అలా పిశాచాల్ని దగ్గరకు రానిస్తే తీవరకు వ్యధయి వుంటుంది" అన్నారు.

ఆయన చేతి సర్పతో రాయుడుగారికి యేదో మనసులో జ్యోతి వెలిగినట్లుంది. వెంటనే స్వామిజీని తలచి భగవంతుణ్ని స్మరించి నమస్కరించారు మనసులో. అది నిజంగా పట్టి తీవరు వ్యాధి మాత్రమే కావాలని మనసార ప్రార్థించారు. తన తప్పిదానికి నాలుక కొరుక్కున్నారు. కాని ఆమెను డాక్టరుకు చూపించాలి ముందర. స్వామి దగ్గర సెలవు తీసికొని మఠానికి బయలుదేరారు.

మఠం చేరింతరవాత తెలిసింది రామకోటిగారు విద్యను అప్పుడే డాక్టరు దగ్గరకు తీసికొని వెళ్లారని.

రాయుడి మనసు, జనార్దనస్వామి అనుగ్రహం వల్ల అర్థం కావటం ఆరంభించింది. రామకోటి పాటి చిత్తశుద్ధి తనకు లేదన్న విషయం అతడికి క్రొత్తగా తెలిసిన విషయం. తన మనసు పట్టి బురద గుంటలో దొర్లుతున్నది యిన్నాళ్లన్నా. రామకోటిగారు తనకంటె కొన్ని రెట్లు శుద్ధసత్తుడు.

తను మఠాధిపత్యం పొందవచ్చుననే వూహ వల్ల పాపపు టాశలాటది అనిపించింది. ఆ వూహతోనే బహుశ తన మనస్థితి అనుమానానికి తావిచ్చిందేమో. అరుగు మీద కూర్చొని కళ్లు మూశారు రాయుడుగారు.

రామకోటిగారూ విద్య తిరిగి వచ్చారు మఠానికి. చేతుల్లో మందుల సీసాలున్నాయి. ఆమెకు కడుపులో బల్ల పెరిగిందని డాక్టరు చెప్పాడుట. ఈ అనారోగ్యం ఆవిడకు వుందన్న సంగతి తెలిసిన రామకోటి గారి ముఖం ఎంత సంతోషాన్ని వెలిబుచ్చుతోందో అది చెప్పటానికి విడ్డూరం. రాయుడు యీ విషయం తెలిసికొని అనూహ్యమైన శాంతిని పొందాడు. విద్య లోపలకు వెళ్లింది.

రామకోటిగా రన్నారు—"జనార్దనస్వామి తనకు సన్యాస మిప్పిస్తానని అన్నారనీ స్వామిజీ అనుమతి లేదని తనే సందేహించాడనీ, అందుకు స్వామి, స్వామిజీ అనుమతికేం అది మూడురోజుల్లో రాదా" అని అన్నారనీ చెప్పాడు. ఆ సందర్భంలో రామకోటిగారు స్వామిజీ అనుమతి అదివరకే యిచ్చారు కనక రాయుడుగారికి సన్యాసాశ్రమం యిప్పించవచ్చని చెప్పారుట కూడను. జనార్దనస్వామి మాట్లాడలేదుట. మళ్లీ అడిగితే స్వామిజీ అనుమతి రానీ అన్నారుట.

రాయుడి హృదయం యిది విని పశ్చాత్తాప పరిపూరితమయింది. రామకోటిగారి కాళ్లకు మనసు స్మరించి కళ్లు కద్దుకొన్నాడు.

మూడురోజులకు స్వామీజీ నుంచి జనార్దనస్వామికి ఉత్తరం వచ్చింది. రాయుడుగారికీ, రామకోటి గారికీ యిద్దరికీ ఆశ్రమం యిప్పించవలసిందనీ ఒకరు మఠాన్ని కనిపెట్టుకుని వుంటే రెండవవారు కాశీయాత్ర చేయవలసిందనీ వ్రాశారు.

ఆశ్రమం యివ్వటం జరిగిన నాటిరాత్రి నాల్గో యామాన ఒక స్వామి కాశీ వెళ్లిపోవటం ఎవరికీ తెలీదు. మిగిలిన వారు పీఠాధిపతి అయినారు.

మఠంలోని భృత్యులు చిన్నస్వామి వెళ్లిపోయారా అని ఆశ్చర్యపోయారు. ●

